# మహోన్నత మానవతావాది

**బాలగోపాల్** ఇక లేరన్న విషయాన్ని నమ్మలేకపోతున్నాను. ప్రభుత్వం, మావోయిస్టుల మధ్య శాంతి చర్చలకు చొరవ తీసుకొనేందుకు నిర్వహించిన ఒక సమావేశంలో ప్రసంగించేందుకు గత నెలలోనే ఆయన ఢిల్లీ వచ్చారు. ఆయన మరణంతో భారతదేశంలోని ప్రజాస్వామ్య హక్కుల కార్యకర్తలు ఒక గొప్ప మార్గదర్శిని కోల్పోయారు. భారతదేశపు ప్రగతిశీల ప్రజాస్వామ్య ఆలోచనా స్రవంతిని సమున్నతం చేసిన ఒక అరుదైన మేధావిని భారతీయులు కోల్పోయారు.

మానవహక్కుల ఉద్యమంలో పనిచేస్తోన్న నాలాంటి ఎంతో మందికి బాలగోపాల్ ఒక స్ఫూర్తిదాయక మార్గదర్శి. కణ్ణబీరన్, హరగోపాల్‌లతో కలిసి ఆయన ఉదార వాదుల, మార్క్సిస్టుల ప్రధాన స్రవంతి భావాలను సవాల్ చేస్తూ మానవ హక్కుల అర్థాన్ని నిర్వహించారు. పౌర స్వేచ్ఛ అంటే అన్నిటికీ మించి చట్టబద్ధమైన పాలన కనుక భద్రతా దళాలు చేసే బూటకపు ఎన్‌కౌంటర్లను చట్ట విరుద్ధమైనవిగా పరిగణించాలని బాలగోపాల్ డిమాండ్ చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఉన్న హక్కుల సంఘాలు ఈ అంశానికి ఇచ్చిన ప్రాధాన్యం వల్లే నేడు బూటకపు ఎన్‌కౌంటర్‌లకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయం పటిష్టమయింది. ఇప్పటికీ ఆ బూటకపు ఎన్‌కౌంటర్లు ఆగిపోలేదు. అయితే భద్రతా దళాలు గతంలో మాదిరిగా నిర్భయంగా వాటికి పాల్పడడం లేదు. పాల్పడితే ప్రజలు నిలదీస్తారనే భయం వారిని వెంటాడుతోంది. బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని ప్రోదిచేయడానికి, పౌరహక్కులను పటిష్టం చేయడానికి బాలగోపాల్ చేసిన కృషిని దేశ ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరు.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో పనిచేస్తున్నప్పుడు గానీ, మానవ హక్కుల వేదికలో పనిచేస్తున్నప్పుడు గానీ, బాలగోపాల్ పౌరహక్కులను ఒక సంకుచితార్థంలో పరిగణనలోకి తీసుకోలేదు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక స్వాతంత్ర్యాలకు సామాన్య మానవులకు గల హక్కులే పౌరహక్కులు అని ఆయన నిండుగా విశ్వసించారు. పౌరహక్కుల ఉద్యమంలో భాగంగానే దళితులు, మహిళలు, మైనారిటీలపై జరిగిన దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగాఎన్నో కేసులలో ఆయన వాదించారు. పౌరహక్కుల ఉద్యమాల మూలంగా గత మూడు దశాబ్దాలలో ఆంధ్రప్రదేశ్ సమాజంలో గొప్ప సృజనాత్మక పరివర్తనలు సంభవించాయి. ఈ పరిణామాలకు బాలగోపాల్ చేసిన దోహదం చాలా విశిష్టమైనది. ఆయన నిశిత మేధాశక్తి, నిష్పాక్షిక, నిస్వార్థ నాయకత్వం నుంచి విశాల భారతదేశపు పౌర, మానవహక్కుల ఉద్యమాలు ఇతోధికంగా లబ్ధి పొందాయి.

బాలగోపాల్ గురించిన ఎన్నో జ్ఞాపకాలు నన్ను ఇప్పుడు ముప్పిరి గొంటున్నాయి. ఒక అనుభవాన్ని వివరిస్తాను. 1985లో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో జరిగిన ఒక స్మారక సభలో పాల్గొనడానికి వెళ్ళిన బృందంలో నేనూ ఒక సభ్యుడిని (బాలగోపాల్ అప్పుడు ఎపిసిఎల్‌సి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు). పోలీసులు మావాహనాన్ని ఆపి మమ్ములను అరెస్ట్ చేశారు. రెండు రాత్రులు మేము లాకప్‌లోనే ఉన్నాము. మొదటి రాత్రి నేను నా జోకులతో అందరినీ నవ్వించడానికి ప్రయత్నించాను. అయితే బాలగోపాల్ నా జోకులకు పెద్దగా ప్రతిస్పందించలేదు. నవ్వు వచ్చినా బలవంతంగా ఆపుకున్నారు. మర్నాడు ఉదయం నేను షేవింగ్ చేసుకున్నా ఆయన చేసుకోలేదు. ఎందుకు చేసుకోవడం లేదని ఆదగగా అణచివేతలో ఉండగా షేవింగ్ చేసుకోవడం ఇష్టం లేదని ఆయన సమాధానమిచ్చారు. ఆ రోజు రాత్రి మమ్ములను అడవి గుండా ఒక పట్టణానికి తీసుకెళ్ళారు. ఆ మరునాడు ఉదయం మమ్ములను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచవలసి వుంది. అర్ధరాత్రి దాటిన తరువాత దట్టమైన అడవిలో గుండా వెళుతుండగా నేను ఆయన చెవిలో మెల్లిగా ఇలా అన్నాను : 'మనలను ఏ క్షణంలోనైనా ఎన్‌కౌంటర్ చేయవచ్చునేమో. ఏమైనా ఈ అంతిమ క్షణాల్లో మీతో పాటు ఉన్నందుకు

నేను గర్తిస్తున్నాను'. బాలగోపాల్ పెద్దగా నవ్వి ఇలా అన్నారు: 'మీకు ఆశాభంగం కలుగుతుంది. ఎందుకంటే మనల్ని తీసుకెళుతున్న పోలీసులు శాంతిభద్రతల పోలీసులు కారు, కోర్టు పోలీసులు. కాసేపు వేచి చూడండి. వారు మనకు టీ ఇస్తారు'. నిజంగానే ఒక అరగంట తరువాత మమ్ములను తీసుకెళుతున్న వాహనాన్ని ఒక దాబా వద్ద ఆపి, మాకు మసాలా టీ ఇప్పించారు. మరునాడు మాకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మేధావులు చేసిన ఒత్తిడి వల్ల ఆ తరువాత ఎన్.టి.రామారావు ప్రభుత్వం మా పై కేసును ఉపసంహరించుకొంది. అణచివేతను ఎదుర్కోవడంలోను, మానవ హక్కులను పరిరక్షించడంలోను బాలగోపాల్‌తో పాటు ఇటువంటి అనుభవాలు పొందినవారు ఎంతోమంది ఉన్నారు.

మాన హక్కుల ఉద్యమంమానవవిలువలను పరిరక్షించే స్వతంత్ర రాజకీయ శక్తిగా ఉండాలనే విషయమై బాలగోపాల్ ఎపిసిఎల్‌సి నుంచి వైదొలగి 'మానవహక్కుల వేదిక'ను ఏర్పాటు చేశారు. రాజ్యాంగం, చట్టాలకు కట్టుబడి తమ చట్టబద్ధమైన విధులన్నిటినీ కచ్చితంగా నిర్వర్తించేలా రాజ్యాంగ సంస్థలన్నింటిపై మానవహక్కుల ఉద్యమం ఒత్తిడి తీసుకునావాలని ఆయన విశ్వసించారు. జమ్మూ-కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒరిస్సా మొదలైన రాష్ట్రాలో సైనిక దళాలు, పోలీసుల చట్ట విరుద్ధ చర్యలను బహిర్గతం చేయడానికి ఆయన నిరంతరం శ్రమించారు. అలాగే మావోయిస్టులు అమాయకులను ఊచకోత కోసిన సంఘటనలను కూడా ఆయన తీవ్రంగా ఖండించారు. ఇది మావోయిస్టులకు కోపకారణమయినప్పటికీ పలు సందర్భాలలో వారు తమ తప్పును బహిరంగంగా ఒప్పుకోవడం జరిగింది. కొద్ది రోజుల క్రితం జార్ఖండ్‌లో ఒక పోలీసు అధికారి తలను నరికివేసిన ఘటన కూడా ఇటువంటిదేనని చెప్పవచ్చు. పౌరహక్కుల సంఘాలన్నీ మావోయిస్టుల ఆ చర్యను తీవ్రంగా ఖండించాలి.

అణచివేతకు గురవుతోన్న ప్రజలే ఆ అణచివేత వాస్తవాలను అంగీకరిస్తుండగా మానవహక్కుల పరిరక్షణ పేరిటచేస్తున్న కృషి అమూర్త మానవ విలువలను రక్షించడమే కాదా అని మాలో చాలా మందిమి బాలగోపాల్‌తో వాదించడం జరిగింది. అయితే

ఆయన ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు. రాజకీయ, ఆర్థిక పరిస్థితులను నిశితంగా విశ్లేషించి, నాగరికతల చరిత్రను లోతైన తాత్త్విక దృక్పథంతో సమీక్షిస్తూ ప్రతి ఒక్కరూ మానవ హుందాతో కూడిన జీవితాన్ని పొందేందుకు మానవాళి చేసిన కృషిని మాకు ఉత్తేజకరంగా వివరించారు. మానవ విలువలకు మన నిబద్ధతే మానవ హక్కులను పరిరక్షించడంలో మన కృషి తీరుతెన్నులను ప్రతి స్థాయిలోనూ నిర్ణయిస్తుందని బాలగోపాల్ విశ్వసించారు. ప్రజాస్వామిక హక్కులకోసం నిరంతర పోరాటం చేసిన ఈ మహోన్నత మానవతావాది వారసత్వం ఆ నిండు విశ్వాసమేనని నిస్సందేహంగా చెప్పవచ్చు.

**- మనోరంజన్ మహంతి**

*వ్యాసకర్త ఢిల్లీ విశ్వవిద్యాలయ రాజనీతి శాస్త్ర*
*విశ్రాంత అధ్యాపకులు, మానవహక్కుల ఉద్యమకారుడు*
*ఆంధ్రజ్యోతి, 10 అక్టోబరు, 2009*